# మన మెట్రో.. మనకెంతో గర్వకారణం




**హైదరాబాద్లో పెరుగుతున్నట్రాఫిక్ భూతం.. ప్రజలు పడుతున్న అవస్థలు.. వీటికి శాశ్వత పరిష్కారాన్ని చూపెట్టడానికి.. నగరానికి నలువైపులా 665 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో.. కోటీన్నర మందికి అక్కరకొచ్చేలా ఏర్పాటవుతోన్న సరికొత్త రవాణా వ్యవస్థ.. ప్రపంచ నగరాల సరసన చోటు దక్కించుకోవడానికి రూపుదిద్దుకుంటున్న హైదరాబాద్ మెట్రో రైలుకి స్వాగతమని నగరవాసులు చెబుతున్నారు. రాష్ట్రానికే గర్వకారణంగా నిలవడానికి.. అద్భుతమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో.. అత్యంత వేగంగా అభివృద్ధి వైపు పరుగులు పెట్టడానికి సిద్ధమవుతోంది.. మన మెట్రో**

బూమ్ కనుమరుగై.. మాంద్యం ఏర్పడింది కానీ లేకపోతే మన హైదరాబాద్ ఎక్కడో ఉండేదని చాలామందికి తెలిసిందే. వాస్తవానికి భాగ్యనగరం అద్భుతమైన అవకాశాలకు చిరునామా అని చెప్పొచ్చు. ఎందుకంటే, భారతదేశంలో అధిక జనాభా గల నగరంలో మనదే ఆరో స్థానం. మన దేశంలో నాలుగో అతిపెద్ద నగరం కూడా ఇదే. సంస్కృతికి, సంప్రదాయానికి మారు పేరు గల ఈ చారిత్రాత్మక నగరం.. ప్రస్తుతం ఐటీ, ఐటీఈఎస్, బయోటెక్, ఫార్మా, పర్యాటక రంగాలకు ప్రధాన చిరునామా అయ్యింది. అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న హైదరాబాద్ మెట్రో రైలు రాకతో మరింత సుందరంగా ముస్తాబు కానుంది. మెట్రో రాకతో ప్రపంచ నగరాల్లో ఒకటిగా చోటు దక్కించుకోనుంది.

మనదేశంలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో.. మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్ని విజయవంతంగా చేపట్టిన ఎల్ అండ్ టీ కి.. ఆంధ్రప్రదేశం ప్రభుత్వం మెట్రో నిర్మాణ బాధ్యతల్ని అప్పచెప్పింది. హైదరాబాద్కే తలమానికమైన ఈ ప్రాజెక్టును పూర్తి చేయడం కోసం ఎల్అండ్ టీ ప్రత్యేకంగా ఎల్ అండ్ టీ ఎంఆర్ హెచ్ ఎల్ సంస్థను ఏర్పాటు చేసింది. నిర్మించు, నిర్వహించు, బదిలీ చేయు పద్ధతిలో.. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాజెక్టుగా ఇది చరిత్రకెక్కింది. పక్కా ప్రణాళికలతో 71.6 కిలోమీటర్ల దూరంలో ఈ రైలు రాకపోకలను సాగిస్తుంది. మొత్తం మూడు కారిడార్లలో.. 66 అత్యాధునిక స్టేషన్లను ఏర్పాటు చేస్తారు. ఇందులోని భోగీలన్నీ ఏసీవి కావడంతో ప్రయాణీకులెంతో ఆనందంగా ప్రయాణం చేయవచ్చు.

మెట్రో రైలును ఎలా నిర్మిస్తారనే సందేహం చాలామందికి కలుగుతుంది. సుమారు ముప్పయ్ అడుగుల ఎత్తులో స్తంభాలు వేసి.. ముందుగా










తయారు చేసిన సెగ్మెంట్లను కలిపి.. ఫ్లైఓవర్ వంటి వయాడక్ట్ను నిర్మిస్తారు. వాటి పై నుంచి రైల్వే లైన్లు వేసి మెట్రో ట్రైన్లను నడుపుతారు. ఇదిపూది. పూర్తయితే నగరంలో రవాణా సమయం గణనీయంగా తగ్గుతుంది. అంతేకాదు, నగరంలోని అన్ని వర్గాల వారికి మెట్రో సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. ప్రజా రవాణా వ్యవస్తకు చక్కటి పరిష్కారాన్ని చూపెట్టే ఈ వ్యవస్థ నగరానికే గర్వకారణం అవుతుంది.

- మెట్రో రైల్వే స్టేషన్లను చూస్తే ఎవరికైనా ఆశ్చర్యమేస్తుంది. అన్ని సదుపాయాలతో పర్యావరణానికి అనుకూలమైన ఆధునిక స్టేషన్లు ప్రయాణీకులకు చక్కటి ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. ప్రత్యేకంగా ఎస్కలేటర్లు, ఎలివేటర్లను ఏర్పాటు చేస్తారు. వికలాంగులకు ఇబ్బంది కలగనీయకుండా ప్రత్యేక జాగ్రత్తలుంటాయి. రైళ్ల రాకపోకల సమాచారాన్ని తెలియజేసే బోర్డులను ఏర్పాటు చేస్తారు. మెట్రో స్టేషన్లోకి అడుగుపెట్టిన



వారెవ్వరైనా.. ఇంటిక్కావాల్సిన సమస్త వస్తువుల్ని ఇక్కడ ఏర్పాటయ్యే షోరూముల్లో కొనుక్కోవచ్చు. స్టేషన్లోకి అడుగుపెడితే చాలు విదేశాల్లో ఉన్నామా అనే సందేహం కలుగుతుంది. ఆధునిక షాపింగ్కు సరికొత్త చిరునామాగా మారుతుంది. వాణిజ్య సముదాయాలు, రెస్టారెంట్లు, ఏటీఎం సెంటర్లు, బ్యూటీ పార్లర్లు, ఈసేవా కేంద్రాలు తదితర బోలెడు సదుపాయాలు ఇక్కడుంటాయి. చిన్నారులు ఆడుకోవడానికి విడిగా ఆటస్థలాలుంటాయి. ప్రజలు తరుచూ ఎదుర్కొనే పార్కింగ్ సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని మెట్రో స్టేషన్లు చూపెడతాయి. కార్లు, టూ వీలర్లను పార్క్ చేసుకోవడానికి ఎలాంటి ఇబ్బంది పడక్కర్లేదు. టోకెన్ పద్ధతిలో ప్రవేశ మార్గాలుంటాయి. మహిళలు, వృద్ధులకు ప్రత్యేక సౌకర్యాల్ని ఏర్పాటు చేస్తారు. అత్యంత రద్దీ సమయాల్లో కూడా రెండు నుంచి మూడు నిమిషాల్లో వేలాదిమంది ప్రయాణీకులను గమ్యస్థానాలకు చేరవేస్తుంది.

- ఆటోమెటిక్ ట్రైన్ కంట్రోల్ సిస్టమ్ పరిజ్ఞానంతో రూపుదిద్దుకుంటున్న ఆధునిక రైల్వే వ్యవస్థే.. హైదరాబాద్ మెట్రో రైల్. నగరంలోని కీలక ప్రాంతాలు, ఫ్లైఓవర్లు, రైల్వే ట్రాక్కులను కలుపుకుంటూ ఈ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నారు. కొత్తవారెవరైనా.. హైదరాబాద్ సంస్కృతి, సంప్రదాయాల గురించి తెలుసుకోవాలన్నా.. నగర అందాల్ని వీక్షించాలన్నా.. ఢిల్లీ తరహాలో మెట్రోలో ప్రయాణిస్తే సరిపోతుంది. భాగ్యనగర వారసత్వ సంపదకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా.. నిర్మాణ పనులను చేపడతారు. ఇది పూర్తయితే ఆయా ప్రాంతాలకెంతో సులువుగా చేరుకోవడానికి వీలవుతుంది. రైల్వే స్టేషన్లు, ఎంఎంటీఎస్ స్టేషన్లు, బస్ డిపోలను అనుసంధానం చేస్తారు. ఏ రైలులో నుంచి ప్రయాణీకులు దిగినా.. మెట్రో రైలును అందుకునేలా స్కై వాక్లను ఏర్పాటు చేస్తారు. స్టేషన్లోని నుంచి బయటికి రాగానే.. అక్కడి చుట్టుపక్కల కాలనీలకు ప్రయాణీకులను చేరవేయడానికి ప్రత్యేకంగా ఫీడర్ బస్సులుంటాయి.
- రైళ్లకు మరమ్మతులు, నిర్వహణ పనుల్ని చేపట్టడానికి ప్రత్యేకంగా మూడు డిపోలను ఏర్పాటు చేస్తారు. మూడు కారిడార్లలో మెట్రో రైలు రాకపోకల్ని నిర్వహించడానికి ఉప్పల్ లో ఆపరేషన్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

మొత్తానికి హైదరాబాద్లో పెరుగుతున్న ట్రాఫిక్ భూతానికి మెట్రోరైలే ఏకైక పరిష్కారమని చెప్పొచ్చు. పచ్చదనం, పరిశుభ్రతను పెంపొందించడానికి, భాగ్యనగర బంగారు భవిష్యత్తుకు.. హైదరాబాద్ అభివృద్ధికి రాచబాట వేయడం కోసమే రూపుదిద్దుకుంటోంది.. హైదరాబాద్ మెట్రో. మొత్తానికి నగరానికి మెట్రో రాక మనకెంతో గర్వకారణమని చెప్పొచ్చు. దీంతో ప్రజలంతా మన మెట్రో.. మనకెంతో గర్వకారణమని అంటున్నారు. ఆస్తి